50కి పైగా మందులు నాసిరకం

న్యూఢిల్లీ: దేశంలో పారాసిటమాల్, పాన్ డి, కాల్షియం, విటమిన్ డీ3 సప్లిమెంట్స్, యాంటీ-డయాబెటిక్ సహా 50కి పైగా మందులు నాసిరకంగా ఉన్నాయని కేంద్ర ఔషధాల ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) తాజా నివేదిక వెల్లడించింది. ఆగస్టు నెలకు గాను విడుదల చేసిన ఈ నివేదికలో షెల్కాల్, విటమిన్ సి సాఫ్ట్‌జెల్స్‌తో కూడిన విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ సి అండ్ డీ3, సిప్రోఫ్లోక్సాసిన్ తదితర ఔషధాలూ తగిన నాణ్యత లేనివిగా తేలాయి. అధిక రక్తపోటుకు వాడే టెల్మిసర్టాన్, ఆస్ట్రోపైన్ సల్ఫేట్, అమోక్సీసిల్లియన్, పొటాషియం క్లావులనేట్ కూడా నాసిరకంగా ఉన్నట్టు తెలిసింది. నాణ్యత లేని ఔషధాల అలర్ట్ డాటాను ఆగస్టు నెలకు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలు సమర్పించలేదని సీడీఎస్‌సీవో తెలిపింది.

షేక్ హసీనాను గద్దె దింపడం వెనక కుట్ర

బంగ్లాదేశ్ తాత్కాలిక చీఫ్ యూనస్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా గద్దె దిగడం యాదృచ్ఛికంగా జరగలేదని, దీని వెనక కుట్ర ఉందని ఆ దేశ తాత్కాలిక చీఫ్ మహమ్మద్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. హసీనా గద్దె దిగి దేశాన్ని విడిచిపెట్టడంలో మాఫజ్ అబ్దులా హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశం దేశాన్ని కుదిపేసి హింసకు దారితీయడంతో మరో దారిలేక హసీనా ప్రధాని పీఠం వదలి దేశం విడిచి భారత్ చేరుకుని ఆశ్రయం పొందుతున్నారు.

కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై దాడి!

గత 10 రోజుల్లో రెండో ఘటన

వాషింగ్టన్, సెప్టెంబర్ 26: అమెరికాలో హిందూ దేవాలయాలే లక్ష్యంగా విద్వేష మూకలు దాడులకు తెగబడుతున్నాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలో దుండగులు ఓ హిందూ ఆలయంలో చొరబడి విధ్వంసం సృష్టించారు. శాక్రమెంటోలోని 'బీఏపీఎస్ హిందూ ఆలయం'పై రంగులు జల్లి, ఆలయం పవిత్రతను దెబ్బతీశారు. 'హిందూస్ గో బ్యాక్' అంటూ దేవాలయం గోడలపై పెయింటింగ్‌తో రాశారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని తెలిసింది. గత పది రోజుల్లో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి.

చెఫ్‌లు, వెయిటర్లు మాస్కులు, గ్లౌజులు ధరించాల్సిందే

యూపీ సర్కార్ ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: హోటళ్లు, రెస్టారెంట్లలో కఠిన శుభ్రత ప్రమాణాలను అమలు చేయడంలో భాగంగా చెఫ్‌లు, వెయిటర్లు తప్పనిసరిగా మాస్కులు, గ్లౌజులు ధరించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. అలాగే సీసీటీవీ కెమెరాలు కలిగి ఉండటం తప్పనిసరి అని చెప్పింది. రాష్ట్రంలో ఉమ్మి, మూత్రంతో ఆహార కల్తీ జరిగిన ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. మానవ వ్యర్థాలు లేదా అపరిశుభ్ర పదార్థాలతో ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పెరగనున్న చక్కెర ధరలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: దేశంలో చక్కెర ధరలు పెరగనున్నాయి. 2024-25 సీజన్ (అక్టోబర్-సెప్టెంబర్)కు సంబంధించి చక్కెర, ఇథనాల్ కనీస విక్రయ ధర (ఎంఎస్‌పీ) పెంచాలని కేంద్రం నిర్ణయించడంతో చక్కెర ధర పెరగనుంది. 'చక్కెర కనీస విక్రయ ధరను పెంచాలన్న ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నాం. అలాగే ఇథనాల్ ధరను కూడా పెంచుతాం. ఈ విషయం పెట్రోలియం శాఖ పరిశీలిస్తుంది' అని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం తెలిపారు.

'రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ వెనుకాడదు'

ముంబై, సెప్టెంబర్ 26: దేశంలో రిజర్వేషన్ల రద్దుకు మోదీ సర్కార్ వెనుకాడబోదని, దీనిపై బీజేపీ వర్గాలు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాయని కాంగ్రెస్ నాయకుడు పీ చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకున్నా.. రిజర్వేషన్లను దెబ్బతీయడానికి మోదీ సర్కార్ ప్లాన్ చేస్తున్నదని, ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేపడుతుందని అన్నారు.

జాబ్‌లెస్ నుంచి జాబ్ లాస్ వైపు!

దేశంలో ఉద్యోగ సంక్షోభం

- గతంలో కొత్త కొలువుల కోసం ఎదురుచూపులు
- ఇప్పుడు ఉన్న కొలువులు ఊడుతాయనే భయాలు
- ఎంఎన్‌సీల్లో వేలాది ఉద్యోగులకు లేఆఫ్‌లు
- చిన్న కంపెనీల్లో సైలెంట్ లేఆఫ్‌ల సంస్కృతి
- దినదిన గండంగా ప్రైవేటు ఉద్యోగుల జీవితాలు
- లాభాలున్నా ఉద్యోగాలు పెంచని పెద్ద కంపెనీలు
- ఐఐటీల్లో చదివినా ఉద్యోగాలు దొరకని పరిస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 26: దేశంలో ప్రైవేటు ఉద్యోగి జీవితం దినదిన గండంగా మారుతున్నది. ఎంత పెద్ద కంపెనీ అయినా ఉద్యోగానికి గ్యారెంటీ లేకుండా పోతున్నది. లాభాలు లేవనో, ఖర్చులు తగ్గించాలనో, ఏఐతో ఉద్యోగుల అవసరం తగ్గిందనో ప్రతీనెలా పదుల సంఖ్యలో కంపెనీలు వేలాది మందికి లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. గతంలో చదువు పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు దొరకకపోవడం, చదువుకు తగ్గ ఉద్యోగాలు లభించకపోవడమే భారత్‌లో సమస్యగా ఉండేది. ఇప్పుడు ఉద్యోగాలు ఉన్నా ఏ సమయాన లేఆఫ్ జాబితాలో ఉంటామో అనే బెంగ ఉద్యోగులను కలవరపరుస్తున్నది. ఒక్కమాట చెప్పాలంటే.. ఇప్పటివరకు జాబ్‌లెస్ ఇండియాగా ఉన్న మన దేశంలో ఇప్పుడు జాబ్‌లాస్ ఇండియాగా కొనసాగుతున్నది. మరోవైపు దేశంలో నిరుద్యోగుల కష్టాలూ తీరడం లేదు. చదువుకు తగ్గ ఉద్యోగాలు లేక గిగ్ వర్కర్లుగా మారుతున్న వారి సంఖ్య వేలల్లో ఉంటున్నది. ఐఐటీల్లో చదివిన వారికి సైతం ఉద్యోగాలు దొరకడం లేదు. దేశంలోని అనేక పెద్ద కంపెనీల ఆదాయాలు పెరుగుతున్నా.. ఆ సంస్థలు కల్పించే కొత్త ఉద్యోగుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. యువతకు కొత్త ఉద్యోగాలు దొరక్కపోవడం, ఉద్యోగాలు చేస్తున్న వారిలో అభద్రతాభావం అన్ని రంగాల్లోనూ ప్రభావం చూపిస్తున్నది.

ప్రతినెలా వేల మంది ఉద్యోగాల కోత

దేశంలో ఐటీ రంగంలోని ఉద్యోగులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. 2023 ఆరంభంలో మొదలైన లేఆఫ్‌ల సీజన్ ఇప్పుడు తీవ్రంగా మారింది. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డాటా ప్రకారం ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 445 కంపెనీల్లో 1,37,460 మంది ఉద్యోగుల కొలువులు పోయాయి. ఇందులో భారతీయుల వాటానే అధికం. అనేక బహుళ జాతి సంస్థలు ఖర్చులు తగ్గించుకునేందుకు లేఆఫ్‌ల బాట పడుతున్నాయి. అయితే, పెద్ద కంపెనీలు ప్రకటించే లేఆఫ్‌లు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. చిన్న సంస్థలు నిత్యం వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నప్పటికీ ఈ లెక్కలు బయటకు రావడం లేదు. అనేక కంపెనీలు 30 రోజుల గడువు ఇచ్చి కొత్త ఉద్యోగం చూపుకోమని సూచిస్తూ 'సైలెంట్ లేఆఫ్' చెప్పున్నాయి. ఈ లెక్కలు బయటకు రావడం లేదు. సహజంగా ఒక ఉద్యోగం నుంచి మరో ఉద్యోగంలోకి మారినప్పుడు వేతనంలో 'హైక్' అడిగే పద్ధతి ఉంది. ఇప్పుడు మాత్రం ఏదో ఓ ఉద్యోగం దొరికితే చాలనే భావనతో అనేక మంది ప్రస్తుతం పొందుతున్న దాని కంటే తక్కువ వేతనానికి కూడా ఉద్యోగంలో చేరుతున్నారు. చాలామందికి కొత్త ఉద్యోగాలు దొరకక ఖాళీగా ఉండాల్సి వస్తున్నది.

లాభాలున్నా.. కొలువుల్లేవు

దేశంలోని అనేక సంస్థలు ప్రతియేటా లాభాలను, వ్యాపారాన్ని పెంచుకుంటున్నా.. ఉద్యోగుల సంఖ్యను మాత్రం పెంచడం లేదు. వివిధ రంగాల్లో వ్యాపారాలను విస్తరించిన టాటా, రిలయన్స్, అదానీ, బజాజ్, ఏవీ బిర్లా, మహీంద్ర ఇలా అన్ని కంపెనీలదీ ఈ విషయంలో ఒకే తీరు. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పొలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆరు సంస్థలు రెవెన్యూను 7.3 శాతం, లాభాలను 22.3 శాతం, మార్కెట్ కాపిటలైజేషన్‌ను 43.8 శాతం పెంచుకున్నాయి. అయితే, ఈ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య మాత్రం పెరగకపోగా 0.2 శాతం తగ్గింది. ఈ ఆరు గ్రూప్‌లకు కలిసి 69 లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి. బ్లూమ్‌బర్గ్ డాటా ప్రకారం.. వీటిల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 17.4 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 17.3 లక్షలకు తగ్గింది. ఇటీవల దేశంలోని 1,196 కంపెనీలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా ఒక సర్వే చేయగా ఈ సంస్థల్లో ఉద్యోగ కల్పనలో వృద్ధి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5.7% ఉండగా, 2023-24లో కేవలం 1.5% మాత్రమే ఉంది. ఈ కంపెనీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 3,33,000 కొత్త ఉద్యోగాలు వస్తే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 90,840 ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి.

ఐఐటీల్లో చదివినా కొలువు గ్యారెంటీ లేదు

చదువు పూర్తి చేసుకున్న యువతకు ఉద్యోగాలు లభించడం ఏటేటా కష్టంగా మారుతున్నది. గతంలో ఐఐటీల్లో చదివితే క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లోనే కచ్చితంగా మంచి ఉద్యోగం లభిస్తుందనే భరోసా ఉండేది. ఇటీవలి కాలంలో ఈ నమ్మకం కూడా పోతున్నది. దేశంలోని 23 ఐఐటీల్లో దాదాపు 8 వేల మంది విద్యార్థులకు ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు లభించలేదని లెక్కలు చెప్తున్నాయి. 2024లో ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోసం 21,500 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 13,410 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయి. ఐఐటీల్లో చదివిన వారి పరిస్థితే ఇలా ఉంటే మిగతా విద్యాసంస్థల్లో పట్టుభద్రులైన వారికి ఉద్యోగాలు లభించడం మరింత కష్టంగా మారింది. చాలామంది యువతకు చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకక ఏదో ఒక పని చేస్తూ జీవితాన్ని గడుపుతున్నారు.

దేశంలోని 6 పెద్ద వ్యాపార సంస్థలు - ఉద్యోగుల లెక్కలు

ఆధారం: ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్

గ్రూప్ పేరు	సంస్థలు	ఉద్యోగుల సంఖ్య	రెవెన్యూ(రూ. లక్షల కోట్లు)	లాభం(లక్షల కోట్లు)
టాటా	23	8,24,389 / 8,24,344	9.86 / 11.07	0.67 / 0.90
రిలయన్స్	10	4,12,130 / 3,67,507	8.99 / 9.30	0.66 / 0.70
అదానీ	11	34,944 / 35,991	3.33 / 3.09	0.27 / 0.41
బజాజ్	10	1,24,259 / 1,56,834	1.69 / 2.21	0.30 / 0.38
ఏవీ బిర్లా	7	1,33,808 / 1,46,477	4.45 / 4.68	0.25 / 0.27
మహీంద్ర	8	2,12,436 / 2,07,667	1.97 / 2.16	0.17 / 0.16

(2022-23 / 2023-24)

ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు(2024లో)

- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న వారి సంఖ్య: 21,500
- ఉద్యోగాలు పొందిన వారు: 13,410
- ఉద్యోగాలు లభించని వారు: 8,090

ఇజ్రాయెల్ దాడి వల్ల దక్షిణ లెబనాన్‌లో నేలమట్టమైన ఓ భవనం

లెబనాన్‌పై భూతల దాడులు!

- సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ సైన్యం
- 21 రోజుల కాల్పుల విరమణకు అమెరికా, మిత్రపక్షాల ప్రతిపాదన
- తోసిపుచ్చిన ఇజ్రాయెల్ ప్రభుత్వం
- తక్షణం లెబనాన్‌ను వీడాలని భారత పౌరులకు ఎంబసీ సూచన

బీరుట్, సెప్టెంబర్ 26: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్నది. లెబనాన్‌పై గ్రౌండ్ ఆపరేషన్‌కు (భూతల దాడులకు) ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమవుతున్నది. 21 రోజుల కాల్పుల విరమణ పాటించాలని అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలు చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. పూర్తిస్థాయిలో హెజ్బొల్లాపై దాడులు చేయాలని సైన్యాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో లెబనాన్ మరో గాజాలా మారనుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హెజ్బొల్లా అంతానికి పంతం

మొన్నటి వరకు గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని ఇప్పుడు లెబనాన్ వైపు మార్చింది. హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఆ దేశంపై గగనతల, రాకెట్ల దాడులతో విరుచుకుపడుతున్నది. సోమవారం నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 630 మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. లెబనాన్ ఉత్తర, తూర్పు ప్రాంతాలపై ఇజ్రాయెల్ 75 లక్షిత దాడులు చేసింది. దీనికి ప్రతిగా లెబనాన్ చేసిన 45 దాడులను తాము సమర్థంగా తిప్పికొట్టినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. తాజాగా ఇజ్రాయెల్ బుధవారం రాత్రి లెబనాన్‌లోని ఒక భవనంపై జరిపిన దాడిలో సిరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు 23 మంది మరణించారని లెబనాన్ అధికారి తెలిపారు.

కాల్పుల విరమణకు అగ్రదేశాల యత్నం

రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు పలు అగ్రరాజ్యాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వడం లేదు. 21 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ యూఎస్, యూకే, ఈయూ విజ్ఞప్తి చేశాయి. అయితే దీనిని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తోసిపుచ్చారు. హెజ్బొల్లాపై పూర్తిస్థాయిలో దాడి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రస్తుతం లెబనాన్‌పై దాడులు జరుపుతున్నప్పటికీ తమ యుద్ధ లక్ష్యం నెరవేరే వరకు గాజాపై కూడా దాడులు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాటి కోరారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గగన దాడులతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలతో జరుగుతున్న దాడుల వల్ల లెబనాన్ పౌరులలో భయం నెలకొందని అన్నారు

లెబనాన్ వీడండి

లెబనాన్‌లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అక్కడ నివసిస్తున్న భారత పౌరులు దేశాన్ని విడిచివెళ్లాలని, అక్కడే ఉండాలనుకునే వారు జాగ్రత్తలు పాటించాలని బీరుట్‌లోని భారత ఎంబసీ కార్యాలయం విజ్ఞప్తి చేసింది. ఏదైనా అవసరమైతే బీరుట్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

లైవ్ ఇంటర్వ్యూ చేస్తుండగా ఇంటిపై పడ్డ క్షిపణి

లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో లైవ్ టీవీ ఇంటర్వ్యూ జరుపుతున్న లెబనాన్ జర్నలిస్టు ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. మిరయా ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ ఎడిటర్-ఇన్-చీఫ్ ఫడీ బౌండ్య ఒక లైవ్ ఇంటర్వ్యూలో ఉండగా, ఇజ్రాయెల్ ప్రయోగించిన మిస్సైల్ ఒకటి అతని ఇంటిని తాకింది. దీంతో ఆయన బిగ్గరగా అరుస్తూ స్క్రీన్‌కు దూరంగా పడ్డారు.

అదానీతో కెన్యా ఒప్పందం రద్దు

- నైరోబీ విమానాశ్రయ విస్తరణకు అగ్రిమెంట్
- వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున కార్మికుల ఆందోళన
- నిరసనలతో తలొగ్గి ఒప్పందం రద్దు చేసిన కెన్యా

నైరోబీ: నైరోబీ ఎయిర్‌పోర్టు విస్తరణ, నిర్వహణ కోసం అదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని కెన్యా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ(కేఏఏ)ని కెన్యా జాతీయ అసెంబ్లీ ప్రజా పెట్టుబడుల కమిటీ ఆదేశించింది. టెండరు ప్రక్రియపై ప్రత్యేక ఆడిట్ జరిపే వరకు అదానీ గ్రూప్‌తో తదుపరి ప్రక్రియలను నిలిపివేయాలని సూచించింది. కెన్యా రాజధాని నైరోబీలోని జోమో కెన్యట్ట అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు(జేకేఐఏ) ఆధునికీకరణ, 30 ఏండ్ల పాటు నిర్వహణ కోసం అదానీ సంస్థ కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఎయిర్‌పోర్టు కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు సైతం స్తంభించాయి. పలువురు కెన్యా జాతీయ అసెంబ్లీ సభ్యులు సైతం ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అదానీ కంటే ఏఎల్‌జీ అనే స్థానిక సంస్థ మరింత మెరుగైన ప్రతిపాదన చేసినప్పటికీ అదానీకే ఎయిర్‌పోర్టును అప్పగించాలనే నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దీంతో ప్రజా పెట్టుబడుల కమిటీ ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆదేశించింది.

పీఎంఎల్‌ఏ నిబంధనలు ఈడీకి ఆయుధాలు కారాదు

రాజ్యాంగ కోర్టులు ఆ అవకాశం ఇవ్వరాదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: హవాలా చట్టంలోని నిబంధనలను అడ్డం పెట్టుకొని నిందితులను దీర్ఘ కాలం పాటు నిర్బంధంలో ఉంచుకొనే విధంగా ఈడీని అనుమతించరాదని సుప్రీం కోర్టు ఉన్నత న్యాయస్థానాలకు సూచించింది. బెయిల్ మంజూరు చేసే విషయంలో తమకున్న అధికారాలను వినియోగించాలని సూచించింది. హవాలా చట్టంలోని నిబంధనలు ఈడీకి ఆయుధంగా మారకుండా చూసే బాధ్యత రాజ్యాంగ కోర్టుల (సుప్రీంకోర్టు, హైకోర్టు)దేనని స్పష్టంచేసింది. హవాలా చట్టం కింద ఓ నిందితుడిపై దర్యాప్తు.. పరిమితికి మించి దీర్ఘకాలంపాటు కొనసాగుతున్నప్పుడు, బెయిల్ మంజూరుచేసే విషయంలో రాజ్యాంగ కోర్టులు తమకున్న విచక్షణాధికారాన్ని వినియోగించాలని సూచించింది. డీఎంకే నేత, తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధించిన హవాలా కేసుపై విచారణ సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది.

కర్ణాటకలో సీబీఐకి నో ఎంట్రీ

- సాధారణ సమ్మతి ఉపసంహరించుకున్న కాంగ్రెస్ సర్కారు
- ముడా స్కామ్ నేపథ్యంలో సిద్ధూ 'ముందుచూపు'
- గవర్నర్‌కు సమాచారం అందకుండా జాగ్రత్తలు

బెంగళూరు, సెప్టెంబర్ 26: ముడా కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరగనున్న నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేసుల విచారణ చేసేందుకు వీలు లేకుండా సీబీఐకి సాధారణ సమ్మతిని గురువారం ఉపసంహరించుకుంది. సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రకటించారు. సాధారణ సమ్మతిని ఉపసంహరించుకున్నప్పటికీ కేసును బట్టి సీబీఐ విచారణకు సమ్మతిస్తామని తెలిపారు. ముడా స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణతో పాటు బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం హైకోర్టును ఆశ్రయిస్తానని స్నేహమయి కృష్ణ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోవడం ద్వారా రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా ప్రభుత్వం తలుపులు మూసేసింది.

మంత్రివర్గ అనుమతి తర్వాతే గవర్నర్ వద్దకు..

ఇక నుంచి మంత్రివర్గ సమ్మతి తర్వాతనే గవర్నర్‌తో ఉత్తర, ప్రత్యుత్తరాలు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులను మంత్రివర్గం ఆదేశించింది. పలు అంశాలపై తనకు వివరాలు పంపించాల్సిందిగా ఇటీవల సీఎస్‌కు గవర్నర్ లేఖ రాసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. గవర్నర్ అడిగే వివరాలను ముందుగా మంత్రివర్గానికి సమర్పించి, మంత్రివర్గ నిర్ణయాన్ని అనుసరించి గవర్నర్‌కు వివరాలను పంపించాలని అధికారులకు సూచించినట్టు హెచ్‌కే పాటిల్ తెలిపారు.

గోద్రా అల్లర్ల తర్వాత మోదీ రాజీనామా చేశారా?

తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ప్రధాని మోదీ 2002లో గోద్రా అల్లర్ల తర్వాత రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. సిద్ధరామయ్య రాజీనామా చేయాలని విధాన సౌధ వద్ద బుధవారం బీజేపీ చేసిన నిరసనపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సిద్ధరామయ్య తప్పుకోవాల్సిందే

ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సొంత పార్టీ నుంచే మరో ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని కర్ణాటక కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు, మాజీ స్పీకర్ కేబీ కొలివాడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రాకుండా సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సూచించారు. ఈ కేసులో విచారణను ఎదుర్కోవాలని సిద్ధరామయ్యకు స్పష్టంచేశారు. విచారణ తర్వాత ఆయన మళ్లీ సీఎం కావొచ్చని పేర్కొన్నారు. విపక్ష బీజేపీ, జేడీఎస్‌లు కుమ్మక్కై సిద్ధూను పదవి నుంచి దించడానికి ఒక ప్రైవేట్ వ్యక్తితో ఫిర్యాదు చేయించారని కొలివాడ్ ఆరోపించారు.

5 కోట్ల భూమి బీజేపీ నేతకు ధారాదత్తం

మహాసర్కారు కేటాయింపు

ముంబై: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని బీజేపీ అధికారంలోని మహారాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ నేతకు అప్పనంగా కట్టబెట్టడంపై రాజకీయ పార్టీలు మండిపడుతున్నాయి. మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే అధ్యక్షుడిగా ఉన్న శ్రీ మహాలక్ష్మి జగదాంబ సంస్థాన్‌కు నాగపూర్‌లోని కొరాడి ప్రాంతంలో రూ.4.8 కోట్ల విలువైన 5 హెక్టార్ల భూమిని ఉచితంగా కేటాయించారు. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎలాంటి అజెండా, చర్చ జరపకుండా ఏకగ్రీవంగా దీనిని ఆమోదించారు. ఈ భూమి ధారాదత్తంపై ఆర్థిక, రెవెన్యూ శాఖలు అభ్యంతరం చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా భూమిని పొందేందుకు ఉండాల్సిన అర్హత, అనుభవం ఆ ట్రస్టుకు లేకపోయినా భూమిని కేటాయించారు. ప్రభుత్వ చర్యపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

ఏటా వెయ్యి హాలిడే, వర్క్ వీసాలు

ఇండియన్స్‌కు ఆస్ట్రేలియా ఆఫర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం ఆస్ట్రేలియా కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా 1000 వరకు వర్క్, హాలిడే వీసాలను భారతీయులకు మంజూరు చేయబోతున్నట్టు గురువారం ప్రకటించింది. ఉద్యోగం, ఉన్నత విద్య, పర్యాటకం నిమిత్తం ఒక ఏడాదిపాటు ఆస్ట్రేలియాలో ఉండేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. 18 నుంచి 30 ఏండ్ల భారత పౌరులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ఇంద్రసేనారెడ్డికి మిజోరాం గవర్నర్‌గా అదనపు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తేతెలంగాణ): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డికి మిజోరాం రాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి భవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా మిజోరాం గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి సెలవుపై వెళ్లడంతో ఇంద్రసేనారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చారు.

'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్ల ఆవిష్కరణ

పుణె, సెప్టెంబర్ 26: దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని మోదీ గురువారం ఆవిష్కరించారు. వాతావరణం, వాతావరణ పరిశోధనపై రూ.850 కోట్లతో ఏర్పాటుచేసిన కంప్యూటింగ్ వ్యవస్థను, శాస్త్రీయ పరిశోధన కోసం రూ.130 కోట్లతో పుణె, ఢిల్లీ, కోల్‌కతాలలో ఏర్పాటుచేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. కుంభ వృష్టి, వేడి గాలు లు, తుఫాన్లు, భారీ వర్షం, వడగండ్ల వాన, కరువు పరిస్థితుల్ని అంచనా వేసేందుకు పుణె, నోయిడాల్లో అత్యంత శక్తివంతమైన కంప్యూటింగ్ వ్యవస్థలను తీసుకొచ్చారు.

రోజువారీ కనీస వేతనం 1,035

కార్మికుల వేతనాలను పెంచిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: క